జువెనైల్ హోంలను సందర్శించిన కలెక్టర్


ఆర్చరీ శిక్షణను పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్

సైదాబాద్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సైదాబాద్‌లోని ప్రభుత్వ బాలుర గృహం, ప్రత్యేక బాలుర గృహం(జువెనైల్ హోమ్‌లు)లను సోమవారం హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సందర్శించారు. ప్రత్యేక గృహంలో వివిధ కేసుల విచారణలో ఉన్న బాలలు. బాలుర గృహంలో ఉన్న వీధి బాలలు, బాలకార్మికులు, అనాథలకు అందుతున్న విద్య, వైద్య సదుపాయాలు, స్వయం ఉపాధి శిక్షణ, భోజన, వసతి సౌకర్యాలను జువెనైల్ శాఖ డిప్యూటీ డైరక్టర్ డాక్టర్ బేగ్ వారికి వివరించారు. హోంలో విలువిద్య శిక్షణను పరిశీలించి పలు పోటీలలో ప్రతిభ కనబర్చిన చిన్నారులను అభినందించారు. కార్యక్రమంలో హోమ్ సూపరింటెండెంట్లు అఫ్జల్, సంఘమేశ్వర్, నవీన్, గోపి తదితరులు పాల్గొన్నారు.

డి-అడిక్షన్ సెంటర్ కోసం స్థల పరిశీలన

హైదరాబాద్ సిటీ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సైదాబాద్‌లోని ప్రభుత్వ బాలుర చిల్డ్రన్స్ హోమ్‌లో ఏర్పాటు చేయనున్న డి-అడిక్షన్ సెంటర్ స్థలాన్ని సోమవారం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డ్రగ్స్ మహమ్మారితో కలిగే నష్టాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ నివారణకు పటిష్ఠ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కాగా డి-అడిక్షన్ సెంటర్‌కు కావాల్సిన డాక్టర్, కౌన్సిలర్, ఇతర సిబ్బంది వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీడీ మీర్జా రాజ అలీబేగ్, ఏడీ అఫ్జల్, డిసైబుల్డ్ ఏడీ రాజేందర్, ఆర్డీఓ రామకృష్ణ, తహసీల్దార్ జయశ్రీ, పర్యవేక్షకులు సంగమేశ్వర్ పాల్గొన్నారు.


యూజీడీ పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ పారిజాతారెడ్డి, కార్పొరేటర్లు

భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

సరూర్‌నగర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ 20వ డివిజన్‌లోని లక్ష్మీనగర్‌కాలనీ, 30వ డివిజన్‌లోని వెంకటేశ్వరనగర్‌కాలనీలో కొత్తగా చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ నిర్మాణం పనులను సోమవారం ఆయా డివిజన్ల కార్పొరేటర్లు పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, భీమిడి స్వప్నాజంగారెడ్డితో కలిసి మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా కాలనీల ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

రూ. 20 లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబర్ 4(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ 23వ వార్డు లక్ష్మారెడ్డిపాలెంలోని భారతి లుంబిని విల్లాస్‌లో రూ.20లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను సోమవారం వార్డు కౌన్సిలర్ సిద్దంకి కృష్ణారెడ్డి తోటి కౌన్సిలర్లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ దశలవారీగా వార్డులో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. 23వ వార్డును ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దుతానని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు చల్లారీ మురళీధర్‌రెడ్డి, దండెం కృష్ణారెడ్డి, పసుల రాజేందర్, సాయి బృందావనం ట్రస్టు చైర్మన్ గంట నారాయణస్వామి, నాయకులు విజయేందర్‌రెడ్డి, మల్లికార్జున్‌రావు, గోవింద్ రెడ్డి, బాబురావు, శివగౌడ్, మజీద్‌బాబా, శ్రీనాథ్‌రెడ్డి, సాయి, నరేందర్, నాగార్జున, డీఈఈ శివానందం కాలనీవాసులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు పనుల పరిశీలన

చంపాపేట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కాలనీలలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనుల్లో కాలనీవాసులు భాగస్వామ్యం కావాలని కార్పొరేటర్ సుజాతానాయక్ అన్నారు. హస్తినాపురం డివిజన్ హనుమాన్‌నగర్‌కాలనీలో జీహెచ్ఎంసీ నిధులు రూ.80లక్షలతో చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం కార్పొరేటర్ పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతగా చేపట్టాలని అధికారులు, కాంట్రాక్టర్‌ను కోరారు. జీహెచ్ఎంసీ ఏఈ మల్లికార్జున్‌గౌడ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నాణ్యతతో అభివృద్ధి పనులు చేపట్టాలి : లచ్చిరెడ్డి

వనస్థలిపురం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నాణ్యతతో అభివృద్ధి పనులు చేపట్టాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ చైతన్యనగర్‌లో జరుగుతున్న నూతన రోడ్డు పనులను కార్పొరేటర్ లచ్చిరెడ్డి సోమవారం కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు తిప్పర్తి జలంధర్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

రూ.5 కోట్లతో అభివృద్ధి పనులు

ఓల్డ్‌మలక్‌పేట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఓల్డ్‌మలక్‌పేట డివిజన్‌లో ఎమ్మెల్యే నిధులతో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎంఐఎం ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ అధ్యక్షుడు షఫియుద్దీన్ తెలిపారు. సోమవారం స్థానిక ఎంఐఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ.5కోట్లతో ఓల్డ్‌మలక్‌పేటలోని పలు కాలనీలలో సీసీ రోడ్ల నిర్మాణం జరుగుతుందని సంజయ్‌గాంధీనగర్‌లో రూ.20లక్షలతో కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణం రూ.10లక్షలతో గోడలపై ఆర్టులతో సుందరీకణ పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. మున్సిపల్ కాలనీలో వర్షం వచ్చినప్పుడు పెద్దఎత్తున వరద ఇళ్లలోకి వస్తుందని వరద నీటిని మూసీలోకి మళ్లించేందుకు రూ.3కోట్ల80లక్షలతో బాక్స్‌డ్రైన్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు.

డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించండి

దిల్‌సుఖ్‌నగర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి సోమవారం ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ పాటిల్‌కు వినతిపత్రం సమర్పించారు. డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో అంతర్గత రహదారులు దెబ్బతిని అధ్వానంగా ఉన్నాయని, వీధి దీపాలు లేక కాలనీలు అంధకారంలో ఉన్నాయని కార్పొరేటర్ జడ్సీకి వివరించారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్ అభివృద్ధి పనులు చేపట్టేందుకు వెంటనే అంచనాలు తయారు చేయనున్నట్లు తెలిపారు.


క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న వనస్థలిపురం ఏసీపీ కాశీరెడ్డి

క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయి : ఏసీపీ

వనస్థలిపురం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని వనస్థలిపురం ఏసీపీ పల్లె కాశీరెడ్డి అన్నారు. వనస్థలిపురం హిల్‌కాలనీలోని నారాయణ పాఠశాలలో ఏర్పాటు చేసిన క్రీడలను ఏసీపీ ముఖ్య అతిథిగా హాజరై పాఠశాల జీఎం గోపాల్‌రెడ్డితో కలిసి క్రీడలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడలపట్ల ఆసక్తిని పెంచుకుని పోటీల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఏజీఎం హేమేందర్, ఆర్.ఐ రవిప్రసాద్, ప్రిన్సిపాల్ భవాని, కోఆర్డినేటర్ గాయత్రిదేవి, శరత్‌బాబు పాల్గొన్నారు.

వీధి కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడాలి

చంపాపేట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): వీధికుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడాలని కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బందిని కోరారు. చంపాపేట డివిజన్‌లోని మాధవనగర్‌కాలనీ, ఎస్వీకాలనీ, శుభోదయకాలనీలలో ఇటీవల చిన్నారులు వినేష్, శివ, తన్విక్‌లపై కుక్కలు దాడి చేసి గాయపరిచిన సంఘటనలపై సోమవారం కార్పొరేటర్ వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విచ్చలవిడిగా కుక్కలు వీరంగం చేస్తున్నా జీహెచ్ఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది వీధికుక్కలను పట్టుకొని సంరక్షణ కేంద్రాలకు తరలించాలని కోరారు. కార్యక్రమంలో దుర్గానగర్‌కాలనీ అధ్యక్షుడు యాదగిరిరెడ్డి, కార్యదర్శి జగన్నాథ్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు వెంకటేశ్, సందీప్, కృష్ణ ప్రదీప్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

విజిబుల్ పోలీసింగ్‌తో సత్ఫలితాలు

- రోడ్లపై విధుల నిర్వహణతో నేరాలు తగ్గుముఖం
- 15 రోజుల్లో 40 వాహనాల సీజ్

దిల్‌సుఖ్‌నగర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు పోలీస్‌స్టేషన్‌కే ఎక్కువగా పరిమితమైన పోలీసులు.. తమ పద్ధతిని మార్చుకున్నారు. రోడ్ల మీదకు రావడం.. ప్రజల నడుమ ఎక్కువగా కనబడే విధంగా విధి నిర్వహణ తీరును మార్చుకుంటుండడం సత్ఫలితాలనిస్తుంది. నేరాల నివారణపై ప్రత్యేక చొరవ చూపుతున్న రాచకొండ కమిషనరేట్ నూతన బాస్ ఆదేశానుసారం రాచకొండ పోలీసులు విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రజల్లో ఉన్నటువంటి అభద్రతాభావం తొలగిపోవడంతో పాటు.. నేరస్థుల కదలికలు తగ్గుముఖం పట్టేందుకు విజిబుల్ పోలీసింగ్ దోహదం చేస్తుందని సరూర్‌నగర్ పోలీసులు ప్రత్యక్షంగా చేసి చూపిస్తున్నారు. పక్షం రోజులుగా వాహన తనిఖీలు, ఫుట్ పెట్రోలింగ్, సైకిల్ పెట్రోలింగ్ పేరిట రోడ్లపై ఎక్కువగా ఉండేవిధంగా డ్యూటీలు చేపడుతున్నారు. దీంతో ప్రజల నుంచి మంచి స్పందన రావడంతో పాటు, నేరస్థుల కదలికలు తగ్గుముఖం పడుతున్నవి. పోలీసులు రోడ్లపై విధులు నిర్వర్తిస్తుండడం మూలంగా నేరస్థులు ఆ ప్రాంతంలో సంచరించేందుకు జంకుతారనడంలో సందేహం లేదు. ఓ వైపు ఇప్పటికే చాలా కాలనీలలో నిఘానేత్రాలు ఉండడం.. మరో వైపు పోలీసులు కూడా కాలనీలు, ప్రధాన రహదారులు, బస్తీలలో ప్రత్యక్షమవుతుండడంతో నేరస్థులు ఆ ప్రాంతంలో తిరిగేందుకు భయపడతారన్న రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు ఆలోచన, ఆదేశాల మేరకు సరూర్‌నగర్ పోలీసులు ప్రతి రోజు సాయంత్రం 5గంటల నుంచి రాత్రి వరకు కాలనీలు, రహదారులపైనే విధులు నిర్వర్తిస్తూ, తాము ప్రజల మధ్యలోనే ఉంటూ నేరాల నివారణ కోసం ప్రయత్నిస్తున్నారు.


వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న సరూర్‌నగర్ పోలీసులు

వాహన తనిఖీలతో బెంబేలు..

సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రతి రోజు సాయంత్రం 5 గంటల నుంచి 8గంటల వరకు సుమారు 3గంటల పాటు పలు కాలనీ కూడళ్లు, ప్రధాన రహదారులలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహన తనిఖీలు ముమ్మరంగా చేపడుతున్నారు. వాహన పత్రాలు సరిగాలేని వాహనాలను సీజ్ చేస్తున్నారు. మైనర్‌లు, ట్రిపుల్ రైడింగ్, డ్రైవింగ్ లైసెన్స్ లేని వారు పట్టుబడితే వాహనాన్ని సీజ్ చేయడంతో పాటు, తల్లిదండ్రులను పిలిచి కౌన్సిలింగ్ ఇస్తున్నారు. వాహన పత్రాలు సరిగాలేని వాహనాలను సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్నారు. పక్షం రోజుల వ్యవధిలో సుమారు 40 ద్విచక్రవాహనాలను సీజ్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి వెల్లడించారు.

పెట్రోలింగ్‌కు ప్రాధాన్యం..

ఓ వైపు వాహన తనిఖీలు, మరోవైపు ఫుట్ పెట్రోలింగ్, సైకిల్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. పీ అండ్ టీ కాలనీ, శారదనగర్, దిల్‌సుఖ్‌నగర్, భగత్‌సింగ్, కర్మన్‌ఘాట్, చంపాపేట, కొత్తపేట తదితర ముఖ్య ప్రాంతాల్లో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహిస్తు స్థానికులతో మమేకమవుతున్నారు. స్థానికంగా ఉన్న ఇబ్బందులను, అసాంఘిక కార్యక్రమాలు, అనుమానిత వ్యక్తుల గురించి సమాచారం పోలీసులకు ఇవ్వాలని ప్రజలకు వివరిస్తున్నారు. దీంతో స్థానికుల నుంచి కూడా మంచి స్పందన లభిస్తుంది. ఇదేవిధంగా క్రమం తప్పకుండా తమ ప్రాంతంలో పెట్రోలింగ్ చేపట్టాలని కాలనీవాసులు పోలీసులను కోరుతుండడం విశేషం.

కమిషనర్ ఆదేశాను సారం విజిబుల్ పోలీసింగ్ చేపడుతున్నాం



రాచకొండ కమిషనర్ ఆదేశానుసారం విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించడం జరిగింది. దీని మూలంగా నేరాలు తగ్గుముఖం పట్టినవి. అంతేగాకుండా ప్రజల నుంచి స్పందన వస్తుండడంతో పోలీసు సిబ్బంది కూడా ఉత్సాహంతో పనిచేస్తున్నారు. దీంతో పాటు ఈవ్‌టీజింగ్, సైబర్ నేరాల నివారణకు కూడా ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచిస్తు.. యువతకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు చేపడతాం. ప్రతీ కాలనీలో వ్యాపార సముదాయాల వద్ద సీసీ కెమెరాలను తప్పని సరిగా ఏర్పాటు చేసుకోవాలి. అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై వెంటనే తమకు సమాచారం ఇచ్చి, నేరాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి.

- సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి

సర్వేకు సర్వం సిద్ధం

- 492 మంది ఎన్యూమరేటర్లు
- 49 మంది సూపర్‌వైజర్లు
- 73,800 కుటుంబాల సర్వే


ఎన్యూమరేటర్లకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

చాదర్‌ఘాట్ : కులగణన సర్వే కార్యక్రమం మలక్‌పేట నియోజకవర్గంలో బుధవారం నుంచి ప్రారంభం కానుంది. ఈమేరకు జీహెచ్ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 అధికార యంత్రాంగం విస్తృతమైన ఏర్పాట్లు చేసింది. 15 నుంచి 20రోజుల పాటు జరగనున్నట్లు కుల గణన సర్వే కోసం 492 మంది ఎన్యూమరేటర్లను, వారిని పర్యవేక్షించేందుకు మరో 49మంది సూపర్‌వైజర్లను నియమించారు. మలక్‌పేటలో జరగనున్న కుల గణన సర్వేకు సర్కిల్-6 అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ మురళిమోహన్ నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరించనున్నారు. మలక్‌పేట సర్కిల్-6 పరిధిలోని 73,800 కుటుంబాల నుంచి కులగణన సర్వే ద్వారా వివరాలు సేకరించనున్నారు. ఒక్కో ఎన్యూమరేటర్ ప్రతి రోజు కనీసం 15 కుటుంబాలను సర్వేచేసి వారి నుంచి వివరాలు సేకరించాల్సి ఉంటుంది. ఇలా ఒక్కో ఎన్యూమరేటర్ 150 నుంచి 170 కుటుంబాలను కుల గణన సర్వే చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే సైదాబాద్‌లోని పద్మావతి కమ్యూనిటీహాల్, మలక్‌పేటలోని అఫ్జల్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో కులగణన సర్వే చేయనున్న ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు మాస్టర్ ట్రైనర్లు యూసీడీ ప్రాజెక్ట్ ఆఫీసర్ యుగంధర్‌రెడ్డి, శానిటేషన్ సూపర్‌వైజర్ గోవింద్‌రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి శిక్షణనిచ్చారు. జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ సామ్రాట్ అశోక్ శిక్షణ కార్యక్రమాలను పర్యవేక్షించారు.


యంత్రప్రతిష్ఠ, వార్షికోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

పంచముఖి ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

ఎల్‌బీనగర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): లింగోజిగూడ డివిజన్ భాగ్యనగర్ కాలనీలోని పంచముఖి ఆంజనేయస్వామి ప్రథమ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన యంత్ర ప్రతిష్ఠ, ధ్వజ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ శంకర్, బీఆర్ఎస్ నాయకుడు జగన్నాథ్‌రెడ్డి, ప్రకాష్, యాదిరెడ్డి, వెంకట్‌రెడ్డి, బీరప్ప, సత్తయ్య, రాములు పాల్గొన్నారు.

ఘనంగా సుందరకాండ పాఠ్ భజన కార్యక్రమం

చంపాపేట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో ఆదివారం రాత్రి క్షేతేశ్వర్ సేవా సమితి ఆధ్వర్యంలో సుందరకాండ పాఠ్ భజన కార్యక్రమం ఘనంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ హాజరయ్యారు. ఈసందర్భంగా క్షేతేశ్వర్ కళాబృందం ఆలపించిన ఆధ్యాత్మిక భక్తి గీతాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సామ రమణారెడ్డి, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, మకుటం సదాశివుడు, నర్సింహయాదవ్, నాయకులు వెంకట్‌గుప్తా, సత్యనారాయణ పాల్గొన్నారు.

కాలనీల అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

వనస్థలిపురం: కాలనీల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ శివారు కాలనీవాసులు సోమవారం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ శివారు కాలనీలైన బృందావన్ మెడోస్‌కాలనీ, సౌభాగ్యనగర్‌కాలనీ, శ్రీనివాస కాలనీలతో ఇతర కాలనీలకు డ్రైనేజీతో ఇతర మౌలిక సమస్యలను పరిష్కరించి అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. కాలనీల అధ్యక్షులు పి.శశికాంత్, చిత్తరంజన్, యూత్ కాంగ్రెస్ నాయకురాలు విద్యారెడ్డి, సైదులు, వేణు పాల్గొన్నారు.

ముగిసిన విజిలెన్స్ అవగాహనా వారోత్సవాలు

చంపాపేట: కంచన్‌బాగ్‌లోని మిశ్ర ధాతు నిగమ్ లిమిటెడ్‌లో నిర్వహించిన విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్(2024) వారోత్సవాలు సోమవారం ముగిశాయి. గత నెల 28 నుంచి నవంబరు 3వరకు వివిధ కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మిధానీ సీఎండీ డాక్టర్ ఎస్‌కే ఝా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. 4కిలోమీటర్ల వాకథాన్, బీపీడీఏవీ విద్యార్థులకు నిర్వహించిన క్విజ్, పోస్టర్ మేకింగ్, వ్యాసరచన తదితర పోటీలలో విజేతలకు సీఎండీ బహుమతులను అందజేశారు. అనంతరం మిధానీ డైరెక్టర్(ఫైనాన్స్)ఎన్.గౌరీశంకర్‌రావు, డైరెక్టర్(ప్రొడక్షన్, మార్కెటింగ్)టి.ముత్తుకుమార్‌తో కలిసి సీఎండీ జాగృతి మ్యాగజైన్‌ను ఆవిష్కరించారు.

నూతన గ్రంథాలయం నిర్మించాలి

వనస్థలిపురం : బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ ఎన్జీవోస్ కాలనీలోని పురాతన గ్రంథాలయం స్థానంలో నూతన గ్రంథాలయాన్ని నిర్మించాలని తెలంగాణ అధ్యయన వేదిక ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఎన్జీవోస్ కాలనీలోని శిథిలావస్థలో ఉన్న గ్రంథాలయాన్ని తెలంగాణ అధ్యయన వేదిక ప్రతినిధులు పరిశీలించిన అనంతరం మాట్లాడారు. తెలంగాణ అధ్యయన వేదిక సమన్వయ కర్త భగవంత్‌రెడ్డి, బీజీ ఎంరెడ్డి, అనసూయ, సాయికుమార్, జగన్మోహన్, బుచ్చిరెడ్డి, గోవర్ధన్ పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే ఉత్తమ ఆయుధం : ఉపేందర్‌రెడ్డి

ఎల్‌బీనగర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆత్మరక్షణకు కరాటే ఉత్తమ ఆయుధమని యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని గ్రీన్‌హిల్స్‌కాలనీలో డీజే స్పోర్ట్స్ హబ్‌లో కరాటే తరగతులను ఆయన ప్రారంభించి పోటీలలో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకుడు పెద్దవూర సైదులు, నిర్వాహకులు శ్రీకాంత్, అరవింద్, కరాటే శిక్షకులు మహేష్, రాము, శివ, విప్లవ్ పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి ఆర్థిక సాయం

అబ్దుల్లాపూర్‌మెట్ : బాటసింగారం రైతుసేవా సహకార సంఘంలో సభ్యుడైన అనాజ్‌పూర్‌కు చెందిన రైతు బి. శివ మృతిచెందడంతో ఆయన కుటుంబ సభ్యులకు సోమవారం సంఘం చైర్మన్ చేగూరి భరత్‌కుమార్ 25వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో మేనేజర్ బలేష్‌యాదవ్, డైరెక్టర్లు యాదిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, రాములు, మహిపాల్‌రెడ్డి, జంగయ్యయాదవ్ పాల్గొన్నారు.

14,15,16 తేదీల్లో బ్యాడ్మింటన్ క్రీడలు

మన్సూరాబాద్ : అండర్-11, 13 బ్యాడ్మింటన్ క్రీడాకారులకు సింగల్స్, డబుల్స్ విభాగాలలో 14,15,16వ తేదీల్లో క్రీడలు నిర్వహిస్తున్నట్లు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా పేర్కొన్నారు. సోమవారం నాగోల్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో బ్యాడ్మింటన్ క్రీడలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. వికాస్, హర్షయాదవ్, నాగరాజు, రమేష్ పాల్గొన్నారు.

హయత్‌నగర్ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా ప్రసాద్

హయత్‌నగర్ : బడంగ్‌పేట్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా పని చేస్తున్న సీహెచ్. ప్రసాద్ హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా నియమితులయ్యారు. ఇటీవలే హయత్‌నగర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోత్స్నప్రభ ఉద్యోగ విరమణ చేయడంతో ఖాళీ ఏర్పడింది. దీంతో కళాశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం సోమవారం బడంగ్‌పేట్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌కు హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

భార్యపై అలిగి భర్త అదృశ్యం


నరేందర్

హయత్‌నగర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కుటుంబ తగాదాల నేపథ్యంలో భార్యపై అలిగి భర్త ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లిన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హయత్‌నగర్ డివిజన్‌లోని శుభోదయనగర్ కాలనీలో నివాసం ఉండే నీరుడు నరేందర్(36) ప్రేమించి పెండ్లి చేసుకున్నాడు. గత నెల 20న భార్య ఉషతో నరేందర్ గొడవ పడ్డాడు. దీంతో భార్యపై అలిగి ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లాడు. తర్వాత రోజున భార్య నరేందర్‌కు ఫోన్ చేయగా ఉద్యోగం పని మీద బయటకు వెళ్లాను అని చెప్పి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి పెట్టేశాడు. నాటి నుంచి నేటి వరకు భర్త ఇంటికి రాకపోవడంతో తెలిసిన బంధువుల, స్నేహితుల వద్ద విచారించినా ఆచూకీ లభించకపోవడంతో భార్య సోమవారం హయత్‌నగర్ పోలీసులకు తన భర్త కనిపించడం లేదని ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రాహుల్‌గాంధీకి కాంగ్రెస్ శ్రేణులు ఘన స్వాగతం పలకాలి

- టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్


మాట్లాడుతున్న మధుయాష్కీగౌడ్

వనస్థలిపురం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాహుల్‌గాంధీకి కాంగ్రెస్ శ్రేణులు ఘన స్వాగతం పలకాలని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం వనస్థలిపురంలోని కాంగ్రెస్ కార్యాలయంలో పార్టీ ముఖ్య నేతలు, డివిజన్ అధ్యక్షులు, అనుబంధ సంఘాల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మధుయాష్కీగౌడ్ మాట్లాడుతూ రాహుల్‌గాంధీ ఆకాంక్షలకు అనుగుణంగా దేశంలో ఎక్కడ లేని విధంగా సమగ్ర కులగణన సర్వేను తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. రాహుల్‌గాంధీ కులగణన సర్వేపై సలహాలు, సూచనలు ఇవ్వడంతో పాటు మేధావులతోను సంభాషించి వారి సూచనలు తీసుకోనున్నారని ఆయన తెలిపారు. రాహుల్‌గాంధీని బేగంపేట్ ఎయిర్‌పోర్ట్ నుంచి ఘనంగా స్వాగతం పలికేందుకు ఎల్బీనగర్ నియోజకవర్గం నుంచి ప్రతి బస్తీ, కాలనీ, డివిజన్‌ల నుంచి భారీగా తరలిరావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ముద్దగోని రామ్మోహన్‌గౌడ్, ఎస్వీ కృష్ణప్రసాద్, యోగేశ్వర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు కుట్ల నర్సింహయాదవ్, సదాశివుడు పాల్గొన్నారు.

జనప్రియ మహానగర్‌లో పార్కింగ్ స్థలం కబ్జాపై ఫిర్యాదు


అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు అందజేస్తున్న కార్పొరేటర్ విజయలక్ష్మీరాజ్‌కుమార్

సరూర్‌నగర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జనప్రియ మహానగర్‌లో గల 5వ బ్లాక్‌లోని వాహనాల పార్కింగ్ స్థలాన్ని కొందరు బీఆర్ఎస్ నాయకులు కబ్జా చేసి షట్టర్లు నిర్మించుకుంటున్నారని స్థానిక కార్పొరేటర్ కె.విజయలక్ష్మీ రాజ్‌కుమార్ ఆరోపించారు. సదరు స్థలాన్ని కబ్జాబారి నుంచి కాపాడి వాహనాల పార్కింగ్‌కు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం ఆమె రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌ను కలిసి ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ 5వ బ్లాకులో 118 కుటుంబాలు నివసిస్తున్నాయని, వారి కోసం గ్రౌండ్ ఫ్లోర్‌లో పార్కింగ్ స్థలం వదిలిపెట్టారని అన్నారు. కాగా కొందరు బీఆర్ఎస్ నాయకులు సదరు పార్కింగ్ స్థలాన్ని కబ్జా చేసి కమర్షియల్ షెట్టర్లు నిర్మిస్తున్నారని, అందులోనే పార్టీ కార్యాలయం సైతం ఏర్పాటు చేసుకున్నారని ఆమె తన ఫిర్యాదు లో పేర్కొన్నారు. ఈ విషయమై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని, స్థానికులు కబ్జా విషయమై ప్రశ్నిస్తే కబ్జాదారులు బూతులు తిడుతూ చంపేస్తామంటూ బెదిరిస్తున్నారని కార్పొరేటర్ అదనపు కలెక్టర్‌కు వివరించారు. కాగా దీనిపై విచారణ జరిపి తగినచర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఉండాలి


విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ఎల్బీనగర్ జోన్ ట్రాఫిక్-2 డీసీపీ శ్రీనివాస్

కొత్తపేట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సురక్షిత వాహన ప్రయాణానికి చిన్న నాటి నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఉండాలని రాచకొండ ఎల్బీనగర్ జోన్ ట్రాఫిక్ -2 డీసీపీ శ్రీనివాస్ అన్నారు. సోమవారం మన్సూరాబాద్ జడ్పీహెచ్ఎస్ నుంచి 35 మంది విద్యార్థులు ఎల్బీనగర్ ట్రాఫిక్ కాంప్లెక్స్‌లోని రాచకొండ పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కును సందర్శించారు. టీటీఐ ఏఎస్ఐ సోమ్‌నాథ్, హీరోమోటో కార్ప్ సేఫ్టీ ట్రెయినర్ ప్రవీణ్, సిబ్బంది పార్కు గోడలపై ఉన్న ట్రాఫిక్ నిబంధనల పోస్టర్లు, రోడ్ సైన్స్ చూపుతూ టీటీఐ నిబంధనల ప్రాముఖ్యతను వివరించారు. డీసీపీ శ్రీనివాస్ విద్యార్థులకు హెల్మెట్ ప్రాధాన్యతను వివరిస్తూ సైకిళ్లపై రైడ్ ట్రయల్ నిర్వహించారు. అనంతరం ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులను ప్రశ్నలు అడిగారు. సరైన సమాధానాలు చెప్పిన ఇద్దరు విద్యార్థులకు ఆయన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టీటీఐ ఇన్‌స్పెక్టర్ అర్జున్, ఏఎస్ఐ సోమ్‌నాథ్, సేఫ్టీ ట్రెయినర్ ప్రవీణ్, సిబ్బంది రమేష్ పాల్గొన్నారు.

యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్‌పై అవగాహన

అబ్దుల్లాపూర్‌మెట్ : గుంతపల్లిలోని అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం రాచకొండ పోలీసుల, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్(ఏహెచ్‌టీయూ)సంయుక్త ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏహెచ్‌టీయూ ఎస్ఐ వెంకట్‌శ్రీను, మహిళా ఏఎస్ఐ అనురాధ, ఏఎస్ఐ వెంకటస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రభుత్వం పటిష్ఠ చర్యలు చేపట్టిందన్నారు. అందుకోసమే ఈ యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చైల్డ్ లేబర్, బాండెడ్ లేబర్, బాలిక, మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, లైంగిక దాడులు, బలవంతం వ్యభిచారం, ఇతర దేశాలకు అమ్మేయడం, బెగ్గింగ్, యాంటీ ర్యాగింగ్, సైబర్ క్రైమ్, టీ-సేఫ్ అప్లికేషన్‌తో పాటు ట్రిబుల్ రైడింగ్, డ్రగ్స్, ఈవ్‌టీజింగ్, కొత్త చట్టాలు బీఎన్ఎస్, బీఎన్ఎస్ఎస్, బీఎస్ఏలపై అవగాహన కల్పించారు.

శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు

- భక్తిశ్రద్ధలతో కార్తీక మాస పూజలు

మన్సూరాబాద్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మొదటి సోమవారంను పురస్కరించుకుని ఎల్బీనగర్, మలక్‌పేట్, మహేశ్వరం నియోజకవర్గాల పరిధిలోని ఆలయాలు శివనామ స్మరణతో మార్మోగాయి. ఆ పరమశివుడికి అత్యంత ప్రీతిగల ఈ మాసాన్ని హిందువులంతా పవిత్ర మాసంగా భావిస్తూ ఇళ్లల్లో, ఆలయాల్లో నిత్యం పూజలు చేసి మహాశివుడిపై తమ భక్తిని చాటుకుంటారు. ఇందులో భాగంగా కార్తీక మాస తొలి సోమవారం సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

మన్సూరాబాద్ దుర్గాదేవి ఆలయంలో..

మన్సూరాబాద్ డివిజన్ శ్రీసాయినగర్ కాలనీలోని దుర్గాదేవి ఆలయంలోని కాశీవిశ్వేశ్వరస్వామికి ఆలయ చైర్మన్ పోచబోయిన గణేష్ యాదవ్ ఆధ్వర్యంలో భస్మాభిషేకంను ఆలయ పూజారి బాలమురళీ శర్మ మంత్రోచ్ఛరణల నడుమ ఘనంగా నిర్వహించారు. ఆలయ సభ్యులు హన్మంతరావు, యాదగిరి, అశోక్, రవి, లక్ష్మయ్య, కేశవ తదితరులు స్వామి వారికి పూజలు నిర్వహించారు.


మన్సూరాబాద్‌లోని దుర్గాదేవి ఆలయంలో కాశీవిశ్వేశ్వరుడికి భస్మాభిషేకం నిర్వహిస్తున్న ఆలయ చైర్మన్ పోచబోయిన గణేష్‌యాదవ్ తదితరులు


సరూర్‌నగర్ పాత శివాలయంలో శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు

సరూర్‌నగర్ శివాలయంలో..

సరూర్‌నగర్‌లోని పాత శివాలయంలో ప్రత్యేక పూజాధికాలు నిర్వహించారు. భక్తులు ఆలయాన్ని సందర్శించుకుని దీపాలు వెలిగించి ప్రత్యేక అర్చనలలో పాల్గొన్నారు. శివలింగానికి అర్చన చేశారు.